కరాటేతో ఆత్మరక్షణ

చిన్నారి శాన్వినాయక్‌ను సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్యే గువ్వల బాల్‌రాజ్

చంపాపేట, అక్టోబర్ 17: ఆత్మరక్షణ కోసం కరాటే అవసరమని మాజీ ఎమ్మెల్యే గువ్వల బాల్‌రాజ్ అన్నారు. వచ్చే నెల నవంబర్ 26 నుంచి డిసెంబర్ 3 వరకు మలేషియాలో జరిగే అంతర్జాతీయ అండర్ 14వ కరాటే చాంపియన్‌షిప్‌లో పాల్గొని ప్రథమ శ్రేణిగా నిలిచేందుకు పట్టుదలతో శిక్షణ పొందుతున్న చిన్నారి రమావత్ శాన్వినాయక్, అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే గువ్వల బాల్‌రాజ్‌ను గురువారం ఎల్బీనగర్‌లో నిర్వహించిన ఓ కార్యక్రమంలో కలిసిన సందర్భంగా ఆయన ఆ చిన్నారిని వెన్నుతట్టి ప్రోత్సహించి పట్టుదలతో శిక్షణ పొందితే తప్పకుండా కరాటే చాంపియన్‌షిప్‌లో విజయం సాధిస్తావని ఆశీర్వదించి శాలువాతో సత్కరించారు. తాను కూడా కరాటేలో శిక్షణ పొంది బ్లాక్ బెల్ట్ పొందినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రాండ్ మాస్టర్ రాజా నాయక్, మాస్టర్ కిశోర్, బీఆర్ఎస్ పార్టీ నాయకుడు మహేశ్ నాయక్ పాల్గొన్నారు.

వ్యాపార దుకాణాలకు వేలం

వేలంపాటను పర్యవేక్షిస్తున్న దేవాదాయ శాఖ రంగారెడ్డి జిల్లా సహాయ కమిషనర్ శేఖర్

చంపాపేట, అక్టోబర్ 17: కర్మన్‌ఘాట్ శ్రీధ్యానాంజనేయ స్వామి దేవస్థానం ప్రాంగణంలో నిర్వహించే వ్యాపార దుకాణాలకు ఆలయ కార్యనిర్వాహణాధికారి ప్రేమ్‌కుమార్‌రావు ఆధ్వర్యంలో దేవాదాయ శాఖ రంగారెడ్డి జిల్లా సహాయ కమిషనర్ శేఖర్ పర్యవేక్షణలో గురువారం వేలం పాట నిర్వహించారు. పార్కింగ్ నిర్వహణ నరేశ్ రూ.16,80 లక్షలు, కొబ్బరి చిప్పల సేకరణ సుభాశ్ రూ. 5,61లక్షలు, అమ్మవారి చీరల సేకరణ రాధిక రూ, 1,11లక్షల వేలం పాట ద్వారా కైవసం చేసుకున్నట్లు ఈవో ప్రేమ్‌కుమార్ రావు తెలిపారు.

భాగ్యలక్ష్మి అమ్మవారి పూజలకు రండి..

ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డికి ఆహ్వాన పత్రిక అందజేస్తున్న ఆలయ ట్రస్టీ శశికళ

మన్సూరాబాద్, అక్టోబర్ 17: దీపావళి పండుగను పురస్కరించుకుని చార్మినార్ వద్ద ఉన్న భాగ్యలక్షిమ అమ్మవారి దేవాలయాన్ని సందర్శించి పూజల్లో పాల్గొనాలని కోరుతూ గురువారం దేవాలయం ట్రస్టీ శశికళ ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డికి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ ఎంతో ప్రసిద్ధిగాంచిన భాగ్యలక్ష్మి అమ్మవారిని దర్శించుకునేందుకు ఆహ్వానించిన ఆలయ కమిటీ వారికి ధన్యవాదాలు తెలిపారు. దీపావళి రోజున కుటుంబసభ్యులతో కలిసి భాగ్యలక్ష్మి అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో కర్మన్‌ఘాట్ ఆలయ మాజీ ధర్మకర్త మధుసాగర్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి

అక్బర్‌బాగ్‌లో సమస్యలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే బలాల, జలమండలి అధికారులు

సైదాబాద్, అక్టోబర్ 17 : ప్రజలకు మురుగునీటి ఇబ్బందులు లేకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని జలమండలి అధికారులను మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల సూచించారు. గురువారం అక్బర్‌బాగ్ డివిజన్ పరిధిలోని సూపర్‌బజార్ యూపీ శర్మ దవాఖాన నుంచి ముంతాజ్ కాలేజ్ వరకు 250 డయా పైప్‌లైన్‌తో కొనసాగుతున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన స్థానికులు ఎదుర్కొంటున్న సమస్యను తక్షణమే పరిష్కరించటానికి అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని, పనులకు సంబంధించిన ప్రతి పాదనలు సిద్ధం చేయాలని సూచించారు. స్థానికంగా ప్రజలు ఎదుర్కొంటున్న మురుగునీటి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆస్మాన్ ఘడ్ జలమండలి డీజీఎం హస్మత్ అలీ, ఏఈ అల్తాఫ్, నాయకులు బొల్లు కిషన్, శ్రీధర్ రెడ్డి పాల్గొన్నారు.

చిన్నారులను అంగన్‌వాడీలకు పంపాలి..



అంగన్ వాడీ సెంటర్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే బలాల,సీడీపీఓ పావని

సైదాబాద్, అక్టోబర్ 17 : చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందని మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల అన్నారు. గురువారం చావునీ డివిజన్ పరిధిలోని చంచల్‌గూడ పిల్లగుడిసెల డబుల్ బెడ్రూం సముదాయంలో నూతనంగా ఏర్పాటు చేసిన అంగన్‌వాడీ పాఠశాలను ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డబుల్ బెడ్రూం ఇండ్లల్లో ఉంటున్న చిన్నారుల కోసం నూతన అంగన్‌వాడీ పాఠశాలను ప్రారంభించనున్నట్లు ఈ అవకాశాన్ని స్థానికులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. శంకర్‌నగర్, మూసారాంబాగ్ ప్రాంతాల నుంచి వచ్చిన మూసీ నిర్వాసితుల చిన్నారుల కోసం ప్రత్యేకంగా పాఠశాలను ఏర్పాటు చేశామని తెలిపారు. అక్కడి నుంచి వచ్చిన చిన్నారులకు చదువుకోవటానికి ఇబ్బందులు కలుగకుండా తగిన చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. చావునీ డివిజన్ కార్పొరేటర్ సలాం సాహిద్, యూసీడీ ప్రాజెక్టు ఆఫీసర్ యుగంధర్ రెడ్డి, మహిళ శిశు సంక్షేమ శాఖ చార్మినార్ సీడీపీఓ పావని, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

భాగ్యలత, లెక్చరర్స్‌కాలనీల వద్ద ఫుట్‌ఓవర్ బ్రిడ్జిలు

బ్రిడ్జి స్థలాన్ని పరిశీలిస్తున్న కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి

మన్సూరాబాద్, అక్టోబర్ 17: జాతీయ రహదారికి ఇరువైపుల ఉన్న కాలనీవాసులు రోడ్డు దాటేందుకు ఇబ్బందులు కలుగకుండా ఉండేందుకు గాను త్వరలో ఫుట్‌ఓవర్ బ్రిడ్జిలను నిర్మిస్తున్నట్లు మన్సూరాబాద్ డివిజన్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి తెలిపారు. మన్సూరాబాద్ డివిజన్ హయత్‌నగర్ పరిధిలో జాతీయ రహదారికి ఇరువైపుల ఉన్న కాలనీవాసులు రోడ్డు దాటేందుకు నిర్మించనున్న ఫుట్‌ఓవర్ బ్రిడ్జిల స్థలాలను సంబంధిత అధికారులు, ట్రాఫిక్ పోలీసులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ రహదారి విస్తరణ వలన వేగంగా వచ్చే వాహనాల బారి నపడి ప్రజలు ప్రమాదాల బారినపడకుండా ఉండేందుకు గాను ఫుట్‌ఓవర్ బ్రిడ్జిలను నిర్మిస్తున్నట్లు తెలిపారు. ప్రజల అవసరాల మేర ఎక్కువగా రద్దీగా ఉండే కాలనీల వద్ద ఫుట్‌ఓవర్ బ్రిడ్జిలను నిర్మించనున్నట్లు తెలిపారు. భాగ్యలత సమీపంలోని క్రీడా వద్ద, లెక్చరర్స్ కాలనీ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు వద్ద లిఫ్ట్‌లతో కూడిన ఫుట్‌ఓవర్ బ్రిడ్జిలను నిర్మిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ డీసీపీ శ్రీనివాసులు, ట్రాఫిక్ ఏసీపీ నవీన్‌రెడ్డి, సీఐ గట్టు మల్ల, ఆర్‌అండ్‌బీ విభాగం డీఈ వెంకటేశ్వర్‌రెడ్డి, ఏఈ శరత్ పాల్గొన్నారు.

పార్కు స్థలాలు అన్యాక్రాంతం

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న చెర్కు పల్లి వెంకట్ రెడ్డి

బడంగ్‌పేట,అక్టోబర్17: బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పార్కులు అన్యాక్రాంతమవుతున్నాయని మేయర్‌కు, కమిషనర్లకు ఎన్ని సార్లు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ బీజేపీ అధ్యక్షుడు చెర్కు పల్లి వెంకట్‌రెడ్డి ఆరోపించారు. గురువారం నాదర్‌గుల్‌లో ఉన్న బీజేపీ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల అవసరాల కోసం ఉపయోగించవలసిన పార్కు స్థలాలు కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు, సీడీఎంఏకు ఫిర్యాదులు చేసినా ఇప్పటికి అతి గతి లేదన్నారు. బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 31వ డివిజన్‌లో ఒకే పార్కులో 23 ప్లాట్లు చేసి విక్రయించడం జరిగిందన్నారు. ఆపాట్లను రీసెల్ చేయడమే కాకుండా బ్యాంక్‌లలో పెట్టి లోన్లు తీసుకున్నారన్నారు. మేయర్ వార్డులో జరిగిన అక్రమాలపై ఫిర్యాదు చేస్తే ఇప్పటి వరకు మేయర్ నుంచి ఎలాంటి స్పందన లేదన్నారు. మేయర్ భర్త మున్సిపల్ కార్పొరేషన్‌లో అన్ని విభాగాలలో తలదూర్చి చక్రం తిప్పుతున్నారని ఆరోపించారు. కోట్ల విలువ చేసే పార్కు స్థలాలు అన్యాక్రాంతం అవుతుంటే అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదన్నారు. అధికారులు మౌనంగా ఉండటానికి గల కారణాలు ఏమిటో అర్థం కావడం లేదన్నారు. బడంగ్‌పేటలో అన్ని డివిజన్లలో పార్కు స్థలాలను కాజేస్తున్నారన్నారు. అధికారులు చర్యలు తీసుకోక పోతే ఎక్కడి దాక అయినా పోతామన్నారు. బీజేపీ నాయకులు ఏనుగు రాంరెడ్డి, కర్రె మల్లేశ్, రాంరెడ్డి పాల్గొన్నారు.

రోడ్డు పక్కనే చెత్త కుప్పలు

మనీడ్‌రోడ్డులో రహదారి పక్కన ఉన్న చెత్త కుప్పలు

వనస్థలిపురం, అక్టోబర్ 17 : వనస్థలిపురం డివిజన్‌లో పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా ఉన్నది. రహదారుల పక్కన పేరుకుపోయిన చెత్త కుప్పలు దుర్వాసన వెదజల్లుతున్నాయి. సిబ్బంది తక్కువగా ఉండడం, సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయిలో కనీసం తిరగకపోవడంతో సమస్యలు తలెత్తుతున్నాయి. ఓ పక్క వర్షాలతో దోమలు విపరీతంగా పెరుగుతున్న నేపథ్యంలో చెత్త కుప్పలు మరింత సమస్యగా మారాయి. ఇప్పటికే ప్రజలు సీజనల్ జ్వరాలతో ఆస్పత్రుల బాటపడుతున్నారు. ఖాళీ స్థలాల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించాలని సిబ్బందికి సూచించిన పట్టించుకోవడం లేదని పలువురు వాపోతున్నారు. ఎవరికి చెప్పుకోవాలో తెలియని పరిస్థితుల్లో ప్రజలు దుర్గంధాన్ని భరిస్తున్నారు.అధికారులు చెత్త నిర్వహణపై దృష్టి సారించాలని కోరుతున్నారు.

శివారు కాలనీల్లో డ్రైనేజీలు నిర్మించాలి

జలమండలి జీఎం అశోక్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి

వనస్థలిపురం, అక్టోబర్ 17 : శివారు కాలనీల్లో నూతన డ్రైనేజీ లైన్లు నిర్మించాలని బీఎన్‌రెడ్డినగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి సూచించారు. గురువారం జలమండలి జీఎం అశోక్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఎన్‌రెడ్డినగర్ డివిజన్‌లో సుమారు 20 శివారు కాలనీలు ఉన్నాయన్నారు. ఆయా కాలనీల్లో పూర్తి స్థాయిలో డ్రైనేజీ వ్యవస్థను నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు. డ్రైనేజీలు లేకపోవడంతో రహదారులను నిర్మించలేక పోతున్నామన్నారు. ప్రజలు సెప్టిక్ ట్యాంకులపై ఆధారపడుతున్నారని, అది భారంగా మారుతుందన్నారు. నూతనంగా ఇండ్లు నిర్మించుకునేవారు రూ.లక్షల్లో పన్నులు కడుతున్నారని, వారికి సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత ఉందన్నారు. అధికారులు స్పందించి పూర్తి స్థాయిలో డ్రైనేజీల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. దీనిపై జీఎం సానుకూలంగా స్పందించినట్లు కార్పొరేటర్ తెలిపారు.

చెరువులో పడి యువకుడి మృతి

చంపాపేట, అక్టోబర్ 17: మతస్థిమితం కోల్పోయిన యువకుడు సరూర్‌నగర్ చెరువులో పడి మృతి చెందిన ఘటన గురువారం సరూర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లా, దేవరకొండ మండలం, వెంకటాయపల్లికి చెందిన కాట్రమోని శ్రీనివాస్ తన ఇద్దరు సోదరులతో 20 సంవత్సరాల క్రితం ఉపాధి కోసం హైదరాబాద్‌కు వలస వచ్చి, నగరంలోని నందనవనంలో నివాసం ఉంటూ కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరి ముగ్గురిలో కిశోర్‌కుమార్ (34)కు మానసిక పరిస్థితి బాగలేక ఇంటి వద్దనే ఉండేవాడు. అయితే బుధవారం సాయంత్రం కుటుంబ సభ్యులు పనులు ముగించుకుని తిరిగి ఇంటికి వచ్చేసరికి కిశోర్ ఇంటివద్ద కనిపించక పోవడంతో కాట్రమోని శ్రీనివాస్, వెంకటేశ్‌లు వారి సోదరుడు కిశోర్ కోసం చుట్టూ పక్కల ఎక్కడ వెతికిన ఆచూకీ లభించలేదు. కిశోర్ సోదరులిద్దరు చెరువు చుట్టూ పక్కల ఎంత వెతికినా కనిపించక పోవడంతో గురువారం సరూర్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు, డీఆర్ఎఫ్, ఫైర్ సిబ్బంది చెరువును గాలించి కిశోర్ కుమార్ మృతదేహాన్ని బయటకు తీశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

హైవే విస్తరణ పనులు పరిశీలన

పనులను పరిశీలిస్తున్న ట్రాఫిక్ డీసీపీ శ్రీనివాసులు, కార్పొరేటర్లు

హయత్‌నగర్, అక్టోబర్ 17 : ఎల్బీనగర్ నుంచి మల్కాపూర్ వరకు జరుగుతున్న విజయవాడ జాతీయ రహదారి విస్తరణ పనులను హయత్‌నగర్‌లోని పుల్లారెడ్డి స్వీట్ హౌస్, టేస్టీ బేకరి వద్ద ఎల్బీనగర్ ట్రాఫిక్ డీసీపీ శ్రీనివాసులుతో కలిసి హయత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి, మన్సూరాబాద్ డివిజన్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్లు మాట్లాడుతూ హైవే విస్తరణ పనుల వల్ల హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ వద్ద నుంచి ఆటోనగర్ వరకు యూటర్న్‌లన్నీ మూసివేయడంతో స్థానిక వాహనదారులు, కాలనీల ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. రోడ్డుకు ఇరువైపులా వందల కొద్దీ కాలనీలు ఉండడంతో కాలనీల ప్రజలు చిన్నచిన్న పనుల కోసం హైవేపై 3 కిలోమీటర్లు ప్రయాణించి యూటర్న్ తీసుకోవాల్సి వస్తుందన్నారు. దాంతో వాహనదారులకు ఇందనంతోపాటు సమయం కూడా వృథా అవుతుందని తెలిపారు. హయత్‌నగర్‌లోని ఆర్టీసీ కాలనీతో పాటు పలుచోట్ల సర్వీస్ రోడ్డు పనులు నిలిపివేశారని, యూటర్న్‌లు సమీపంలో లేకపోవడంతో నరకయాతనకు గురవుతున్నారని వివరించారు. జాతీయ రోడ్డు విస్తరణ అధికారులతో ట్రాఫిక్ పోలీసు ఉన్నతాధికారులు చర్చించి వీలైనంత త్వరగా వాహనదారులకు, ప్రజలకు నెలకొన్న సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐలు శ్రీనివాస్, గట్టు మల్లు, నవీన్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

తప్పిపోయిన బాలుడు.. బంధువులకు అప్పగింత

బాలుడిని బంధువులకు అప్పగిస్తున్న మలక్‌పేట పోలీసులు

మలక్‌పేట, అక్టోబర్ 17: మొదటిసారి బంధువుల ఇంటికివచ్చి అడ్రస్ మరచిపోయి దిల్‌సుఖ్‌నగర్‌లో ఏడుస్తూ తిరుగుతున్న ఓ విద్యార్థిని చేరదీసిన మలక్‌పేట పోలీసులు, వారి బంధువుల ఆచూకీ కనుక్కొని అప్పగించారు. ఏపీలోని అన్నమయ్య జిల్లా(పాతచిత్తూరు)కు చెందిన విద్యార్థి జంపాల చైతన్య మొదటిసారి మూసారాంబాగ్ సలీంనగర్‌లో నివాసముంటున్న తన మేనమామ ఇంటికి వారం రోజుల క్రితం వచ్చాడు. కాగా గురువారం మేనమామ కుటుంబ సభ్యులు ఊరికి వెళ్తుండటంతో వారికి బాయ్ చెప్పేందుకు కిందికి వచ్చిన చైతన్య, అక్కడి వీధులను చూడాలనే ఆసక్తితో తిరుగుతూ దిల్‌సుఖ్‌నగర్ వరకు చేరుకున్నాడు. తిరిగి ఇంటికి వెళ్లేందుకు యత్నించినప్పటికీ, దారి తెలువక దిల్‌సుఖ్‌నగర్‌లోని ఆర్ఎస్ బ్రదర్స్ వద్ద ఏడుస్తుండగా గమనించిన మలక్‌పేట ఎస్ఐ సురేశ్, పోలీసు సిబ్బంది, బాలుడిని చేరదీసి వారి బంధువుల అడ్రస్ కనుక్కొని బంధువు శృతికి అప్పగించారు. సురక్షితంగా బాలుడిని అప్పగించిన పోలీసులకు వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

పాఠశాల భవనం ప్రారంభం

పాఠశాల భవనాన్ని ప్రారంభించిన ప్రిన్సెస్ ముఫఖ్ఖం జాహ్

బడంగ్‌పేట, అక్టోబర్17: సృజనాత్మకతను గుర్తించి నైపుణ్యాలను పెంపొందించుకోవాలని ప్రిన్సెస్ ముఫఖ్ఖం జాహ్ అన్నారు. జల్‌పల్లిలో ప్రిన్సెస్ బాలికోన్నత పాఠశాల భవనాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. నిజాం ట్రస్టు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ స్మిత శర్మ, సబిహా సుల్తానా, రఫత్‌తునీసలకు డికెడ్ అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందివచ్చిన ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మీ సామర్థ్యాన్ని వెలికి తీసేందుకు శ్రద్ధగా పనిచేయాలన్నారు. విజయాన్ని సాధించడానికి భవిష్యత్ తరాల యువతకు మార్గాన్ని చూపించాలన్నారు.ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. విజయాలు భవిష్యత్ తరాలకు స్ఫూర్తి నిస్తాయన్నారు. మీ జ్ఞానం మిమ్ములను జీవితాంతం నడిపిస్తుందన్నారు. పాఠశాలలో ఏమైనా మార్పులు చేర్పులు చేయాలనుకుంటే తన దృష్టికి తీసుకు రావాలన్నారు. ఈ కార్య క్రమంలో ప్రిన్సెస్ ముఫకం జా బహుదూర్, సుల్తానా నజీరుల్ అసన్ డైరెక్టర్ ,సైయదా నూర్ ఫాతిమా, మునజా జరీన్, డాక్టర్ సిద్రతుల్ ముంతాహా, డాక్టర్ సనాఫేయిజ్, తసలూత్ సుల్తానా, స్వరూప రాణి తదితరులు ఉన్నారు.

చెట్టు కూలి వ్యక్తి మృతి

మాదన్నపేట ,అక్టోబర్ 17: చెట్టు కూలి వ్యక్తి మృతి చెందిన సంఘటన ఐఎస్ సదన్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బుధవారం రాత్రి కురిసిన వర్షానికి ఐఎస్ సదన్ నైటింగేల్ ఆసుపత్రి వద్ద వేప చెట్టు పడిపోయింది .అదే సమయంలో సాగర్ రింగ్ రోడ్డు వైపు బైక్ పై వెళుతున్న బాల ప్రకాశ్ పై పడడంతో అతను అక్కడిక్కడే మృతి చెందాడు. సమాచారం తెలియడంతో వెంటనే సంఘటన స్థలానికి చేరుకొని మృత దేహాన్ని దవాఖానకు తరలించి వాహనదారులకు ఇబ్బంది కలగకుండా రోడ్డు పై పడ్డ చెట్టును జీహెచ్ఎంసీ సిబ్బందితో కలిసి తొలగించారు.

భవనం పై నుంచి పడి మహిళ మృతి

బడంగ్‌పేట, అక్టోబర్17: భవనం పై నుంచి పడి ఓ మహిళ మృతి చెందిన సంఘటన మీర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. మీర్‌పేట సీఐ నాగరాజు వివరాల ప్రకారం.. నందనవనం లోని మూడో అంతస్తులో నివాసం ఉంటున్న లావణ్య (40) ప్లాస్టిక్ వైర్‌పై నిలబడి ప్లాంటేషన్ మొక్కను సరిచేస్తుండగా జారి పడి మృతి చెందినట్లు సీఐ తెలిపారు. మూడో అంతస్తు నుంచి పడటంతో ఆమె అక్కడికి కక్కడే మృతి చెందినట్లు పేర్కొన్నారు. నుదిటిపై బలమైన గాయం కావడంతో ఆమె మృతి చెందినట్లు తెలిపారు. ఆమె భర్త సుధాకర్ రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యప్తు చేస్తున్నట్లు తెలిపారు.

విద్యుత్ డీఈగా గోపాల కృష్ణ

కందుకూరు, అక్టోబర్ 17 : కందుకూరు డివిజన్ విద్యుత్ నూతన డీఈగా గోపాల కృష్ణ, మండల ఏఈగా విష్ణువర్ధన్ రెడ్డి నియమితులయ్యారు. గతంలో ఇక్కడ పనిచేసిన డీఈతో పాటు ఏఈ రమేశ్ గౌడ్ బదిలీ కావడంతో వారి స్థానాల్లో గోపాల కృష్ణ విష్ణువర్ధన్ రెడ్డిలను నియమించారు. దీంతో వారు పదవీ బాధ్యతలను స్వీకరించిన అనంతరం మాట్లాడుతూ మెరుగైన విద్యుత్‌ను అందించడానికి కృషి చేస్తామని తెలిపారు. సకాలంలో బిల్లులు చెల్లించాలని కోరారు. వినియోగదారులకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటానని తెలిపారు. రైతులు ప్రజలు తనకు సహకరించాలని కోరారు. డివిజన్ పరిధిలోని అన్ని మండలాల్లో పర్యటించి విద్యుత్ సమస్యల పరిష్కరిస్తానని డీఈ గోపాల కృష్ణ తెలిపారు.

ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలి

శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న దేప సురేఖాభాస్కర్‌రెడ్డి

ఆర్కేపురం, అక్టోబర్ 17 : ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతనను అలవర్చుకోవాలని ఆర్కేపురం డివిజన్ మాజీ కార్పొరేటర్ దేప సురేఖాభాస్కర్‌రెడ్డి అన్నారు. ఆర్కేపురం డివిజన్ గ్రీన్‌హిల్స్ కాలనీలో నూతనంగా నిర్మించిన శ్రీ సమర్థ సద్గురు సాయిబాబా దేవాలయంలో గురువారం శిలాఫలకాన్ని ఆవిష్కరించి ప్రత్యేక పూజలు నిర్వహించి. సమర్థ సద్గురు సాయి బాబా దేవాలయ నిర్మాణానికి తమ స్వంత స్థలాన్ని విరాళంగా అందించిన బండపల్లి రీతా (అమల) సంతోష్, బండపల్లి కుటుంబ సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో చిలుక ఉపేందర్‌రెడ్డి, బండి మధుసూదన్‌రావు, గట్ల రవీంద్ర (హైటెక్ రామ్), పిట్ట హరినాథ్‌రెడ్డి, నల్లెంకి ధన్‌రాజ్‌గౌడ్, కుంచారపు సరేంద్ర కుమార్, తలాటి రమేశ్‌నేత, దినేష్‌సింగ్, పగిళ్ల భూపాల్‌రెడ్డి, నరేశ్, ముప్పిడి లింగస్వామిగౌడ్, శివ, జంగారెడ్డి, సిద్ధు తదితరులు పాల్గొన్నారు.

అసత్య ప్రచారం.. ఇద్దరిపై కేసు

హయత్‌నగర్, అక్టోబర్ 17: సంఘం బేకరిపై అసత్య ప్రచారం చేస్తూ సిబ్బందిపై దాడికి పాల్పడిన ఇద్దరిపై కేసు నమోదైన ఘటన హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హయత్‌నగర్‌లోని సంఘం బేకరిలో అన్వర్ ఛాయ్‌ను విక్రయిస్తున్నాడు. అక్కడికి ఛాయ్ తాగడానికి వచ్చిన వీరేశ్, నరసింహలు ఛాయ్‌ను అన్వర్ అపవిత్రం చేస్తున్నాడని దాడికి పాల్పడ్డారు. పైగా సోషల్ మీడియాలో ప్రచారం నిర్వహిస్తున్నారు. సంఘం మేనేజర్ పిస్టిన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా ఇద్దరిపై వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నారు.

'మూసీ' బాధితులకు అండగా ఉంటాం

మైలార్‌దేవ్‌పల్లి, అక్టోబర్ 17: ప్రజలు కష్టపడి కట్టుకున్న ఇండ్లను కూల్చేస్తే చూస్తూ ఊరుకోబోమని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. అత్తాపూర్ డివిజన్ పరిధిలోని మూసీ పరీవాహక ప్రాంతమైన భరత్‌నగర్ కాలనీ, టీకేఆర్ కాలనీల్లో ఇండ్లకు హైడ్రా అధికారులు మార్కింగ్ చేశారు. ఆయా ప్రాంతాలను గురువారం ఎంపీ మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డితో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. మూసీ నది పరీవాహక ఇండ్ల బాధితులకు అండగా ఉంటామన్నారు. పేదలు కష్టపడి సంపాదించుకున్న డబ్బుతో ఇండ్లు నిర్మించుకుంటే వాటిని కూలగోట్టే ప్రయత్నం చేయడం సరికాదన్నారు. కొత్తగా వచ్చి మార్కింగ్ చేయడం దుర్మార్గమైన చర్య అన్నారు. ఈ విషయమై కోర్టు ద్వారా సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ప్రజల ఆస్తి నష్టానికి మూడు రెట్ల పరిహారం ఇచ్చి ఆ తరువాతే ఇక్కడికి రావాలన్నారు. న్యాయం జరిగేంత వరకు పెద్ద ఎత్తున ఆందోళనలు చేప డతామని ఆయన పేర్కొన్నారు. ఎవరూ అదైర్య పడవద్దని బీజేపీ బాధితులందరికీ అండగా ఉంటుందన్నారు. సమావేశంలో బీజేపీ పార్లమెంట్ కన్వీనర్ మల్లారెడ్డి, వై.శ్రీధర్, కొమురయ్య, గౌరీశంకర్, కన్వీనర్ మల్లేశ్‌యాదవ్, వేణుగోపాల్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, అమర్, స్టార్ చిన్నముదిరాజ్, కాలనీల వాసులు పాల్గొన్నారు.